క్లుప్తంగా

కొనసాగుతున్న పోలీస్ పికెట్



బొద్దాంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసులు

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో గురువారం కూడా పోలీస్ పికెట్ కొనసాగింది. రెండు రోజుల క్రితం టీడీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు వైఎస్సార్ సీపీ మద్దతుదారులుపై దాడులకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యగా డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి ఆదేశాల మేరకు పికెట్ ఏర్పాటు చేశామని రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేంత వరకు ఈ పికెట్ కొనసాగిస్తామన్నారు.

సురక్షితమైన తాగునీటిని అందించాలి



వాటర్ ప్లాంట్ యజమానికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని దోసరిరామినాయుడువలస గ్రామంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం సందర్శించి, సురక్షితమైన తాగునీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఎంతమేర నిర్మాణాలు జరిగాయన్న దానిపై ఆరాతీశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



డీఆర్ఎన్‌వలసలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని డీఆర్ ఎన్‌వలస, ఆగూరు, రాజయ్యపేట గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫీల్డ్ వర్క్‌కు వెళ్లినప్పుడు తప్పకుండా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు సకాలంలో అందివ్వాలన్నారు. అలాగే వసూలు చేసిన సేవా రుసుములు ఎప్పటికప్పుడు చలానాల ద్వారా చెల్లించాలన్నారు.

పారిశుధ్య పనుల్లో అశ్రద్ధ వద్దు



మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: పట్టణంలో పారిశుధ్య పనులు చేయడంలో అశ్రద్ధ చేయవద్దని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. స్థానిక పట్టణ పరిధిలోని మెంటిపేట ఎస్సీ కాలనీ, అమ్మవారి కాలనీల్లోని మురుగు కాలువలను గురువారం పరిశీలించిన ఆయన.. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్న కారణంగా ఎక్కడా మురుగునీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయడంతో పాటు రక్షిత మంచినీటి పథకాలు, బోరుబావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏఈ భాగ్యలక్ష్మి ఉన్నారు.

ప్రశంసాపత్రం అందజేత



ఎస్ఐ సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

బొబ్బిలి: విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఎస్ఐ చదలవాడ సత్యనారాయణకు ఎస్పీ దీపికా పాటిల్ చేతులమీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. ఎన్నికల విధుల నిర్వహణలో అత్యుత్తమ సేవలందించినందుకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది ఆయనను అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సంతకవిటి: యోగా డే ఆకృతిలో సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

బాడంగి: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు అన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోయంబత్తూరు యోగాశ్రమం నుంచి యోగా గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ వేసిన యోగా ముద్రలను విద్యార్థులతో వేయించారు. యోగాలో ప్రధానమైన ధ్యానం, యోగముద్ర, దినచర్యలను వివరించారు. అలాగే పాల్తేరు గ్రామంలో బొబ్బిలి ఓంశాంతికి చెందిన బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ బి.కె.రాజేశ్వరి ఆ గ్రామ మహిళలకు యోగాసనాలు నేర్పించి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని, మన శరీరం మనం చెప్పినట్టు వింటుందన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఏవో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాలలో ముందస్తు యోగా డే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం యోగా అక్షరాల ఆకారంలో విద్యార్థులు కూర్చొని, యోగా అవగాహన కల్పించారు.

సంతకవిటి: మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో ముందస్తు యోగా డే గురువారం నిర్వహించారు. పీడీలు సన్నిబాబు, బుజ్జిల ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా డే ఆకృతిలో కూర్చొని, యోగాసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: పాల్తేరులో ప్రాణాయామం చేస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



బొబ్బిలి: యోగా డే ఆకారంలో బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల విద్యార్థులు



పాల్తేరులో మహిళలకు యోగా నేర్పిస్తున్న బొబ్బిలి బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ రాజేశ్వరి

సాగునీటి ప్రాజెక్ట్‌ల పూర్తికి చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

బొబ్బిలి: నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్ట్‌ల పూర్తికి చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కోరారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. పెద్దగెడ్డ ప్రాజెక్ట్ నీటిని రేజేరు, నందబలగ గ్రామాల వరకు తెప్పించాలన్నారు. కేవలం రూ.10 నుంచి రూ.15 కోట్లు ఖర్చు అయ్యే కంచరగెడ్డ, వి.ఆర్.ఎస్ అదనపు ప్రాజెక్ట్, రొంపిల్లి, చిత్రకోట బొడ్డవలస జలాశయాల పనులు చేపడితే మొత్తం 1300 ఎకరాల వర్షాధార భూములకు సాగునీరు అందే అవకాశాలు ఉంటాయన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధుల జమపై ఆందోళన వద్దు

బొబ్బిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీఎం కిసాన్ నిధుల జమపై ఆందోళన చెందవద్దని ఏవో ఎం.శ్యామసుందర్ అన్నారు. స్థానిక పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కేంద్రం ఇటీవల ఆ నిధులను విడుదల చేసిందని, అయితే కొంతమంది తమ బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బులు జమ కాలేదని ఆందోళన చెందుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విడతల వారీగా ఆ నగదు జమ అవుతుందని, ఈ క్రమంలో ఒకరికి ముందు మరొకరికి రెండు రోజులు, మూడు రోజుల తర్వాత పడొచ్చన్నారు.

మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి

రేగిడి: బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమాఆర్ సూచించారు. స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆయుర్వేద వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ఆరోగ్యం తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. మంచి ఆహారం తీసుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం యోగా గానీ వ్యాయామం గానీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పునరుద్ధరించండి

బాడంగి: రేషనలైజేషన్ పేరిట మండలంలోని ఎరుకులపాకలో ఎత్తివేసిన ప్రాథమిక పాఠశాలను తిరిగి పునరుద్ధరించాలని ఎంపీటీసీ పాలవలస గౌరు కోరారు. ఇదే విషయమై ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ గతంలోని ఇక్కడి పాఠశాలను తీసివేయడంతో చాలామంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సుదూర ప్రాంతంలోని గజరాయునివలస యూపీ పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో వారు వ్యయప్రయాసలకు గురవుతున్నారని, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పాఠశాలను తిరిగి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన.. విద్యార్థుల హాజరు శాతంపై ఆరాతీశారు. స్టూడెంట్ కిట్లు విద్యార్థులందరికీ అందించాలని, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం: మొక్కలు పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మండలంలోని బుచ్చింపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.ఉషారాణి అన్నారు. ఆ పాఠశాల ఆవరణలో రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి అందించిన మొక్కలను గురువారం నాటారు. వాటిని సంరక్షించే బాధ్యతను గ్రామానికి చెందిన యువతకు అప్పగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పంటలు సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పంటకు తెగుళ్లు, చీడపీడలు అంతగా సోకవన్నారు. అనంతరం దశకంత కషాయం తయారీ, వినియోగం వివరించారు. ఈ కషాయం తయారీకి స్థానికంగా లభించే 10 రకాల ఆకులు, పొగాకు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, శొంఠిపొడి వంటివి తీసుకుని, ముద్దగా చేసి, పాత్రలో వేసి వేడిచేయాలన్నారు. 20 లీటర్ల గోమూత్రంలో దానిని కలిపి ఒక డ్రమ్‌లో నిల్వ ఉంచితే కషాయం తయారవుతుందన్నారు. ఆరు నెలలు పాటు ఈ కషాయాన్ని వినియోగించవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ గౌరీశ్వరరావు ఐసీఆర్‌పీలు శ్రీదేవి, శ్రీలత, గోవిందమ్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



తెర్లాం: పెరుమాళి ఆర్‌బీకే వద్ద రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు



రాజాం సిటీ: అంతకాపల్లి ఆర్‌బీకే వద్ద రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏవో రేణుకాసాయి

తెర్లాం: రాయితీపై రైతులకు పంపిణీ చేస్తున్న వరి విత్తనాలు, ఎరువులను సక్రమంగా వినియోగించుకోవాలని మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు పెనుమత్స అప్పలరాజు, సర్పంచ్ ప్రతినిధి అప్పచ్చిరాజు కోరారు. మండలంలోని పెరుమాళి ఆర్‌బీకే వద్ద రైతులకు వరి విత్తనాలు, ఎరువులు గురువారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే వరి పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రాయితీపై పంపిణీకి అవసరమైన చర్యలు అధికారులు చేపట్టారన్నారు.

రాజాం సిటీ: మండల పరిధిలోని అంతకాపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు ఏవో ఎం.రేణుకాసాయి చేతులమీదుగా వరి విత్తనాలు గురువారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్‌బీకేలో పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ ఈ విత్తనాలు అందజేస్తున్నామని తెలిపారు.

వంగర: మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన.. రికార్డుల పరిశీలన అనంతరం మంజూరైన విత్తనాలు, ఎరువుల వివరాలు, పంపిణీ చేసిన బస్తాల వివరాలను వీఏఏ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు సకాలంలో అందించాలని ఏవో తెలిపారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని కాలెపు వీధిలో గురువారం జరిగిన కుక్కల దాడిలో పలువురు చిన్నారులు గాయపడ్డారు. వీధిలో ఆడుకుంటున్న లక్ష్మి, విక్కి తదితర చిన్నారులపై ఒక్కసారిగా అక్కడి కుక్కలు దాడికి ఎగబడ్డాయి. వెంటనే స్థానికులు అప్రమత్తమై వాటిని తరిమేసి, గాయపడిన చిన్నారులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రతిరోజూ వీధికుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

సంతకవిటి: మండలంలోని తాలాడ, గరికిపాడు, సంతకవిటి, మందరాడ, ఎం.ఆర్.అగ్రహారం, శ్రీహరినాయుడుపేట, కొండగూడేం గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఒక్కసారి మేఘావృతమై, వాతావరణం చల్లబడి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షం ప్రస్తుతం జరుగుతున్న ఖరీఫ్ పనులకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

బొబ్బిలి: మండలంలోని అలజంగి, వెలగవలస ఫీడర్‌ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్‌లో ఉన్న 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డు, డోలపేట, బుచ్చెంపేట, పొనుగుటివలస ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ కుమార్ గురువారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరగనున్న నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా రెవెన్యూ డే

బొబ్బిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ త్రినాథరావునాయుడు.. రెవెన్యూ వ్యవస్థ గొప్పతనం, దాని ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. అంతకుముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీటీలు సాయికృష్ణ, అప్పయ్య, ఆర్ఐ కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించండి

బాడంగి: శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మండలంలోని గడబవలస గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక రెవెన్యూ కార్యాలయానికి గురువారం వెళ్లి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేత ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలు బాగుచేయండి

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల నుంచి పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువలను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పండించే వరి పంటకు అవసరమైన సాగునీరు చెరువుల నుంచి సక్రమంగా వచ్చేలా కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, పూడికలను తొలగించాలన్నారు. అధికారులు స్పందించి, సత్వరమే చర్యలు తీసుకుంటే వర్షాకాలంలో సాగునీరు సాఫీగా వస్తుందన్నారు.

అంతర పంటగా నవధాన్యాలు వేసుకోండి

రేగిడి: నవధాన్యాలను అంతరపంటగా వేసుకుంటే మంచి లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పైల తవిటినాయుడు తెలిపారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటకూర, గోంగూర, చిక్కుడు, జొన్న, సజ్జ, రాగి తదితర విత్తనాలను పంటల్లో వేయాలని సూచించారు. ఒకేదఫా రెండు నుంచి మూడు రకాల పంటల దిగుబడి వస్తుందన్నారు. ఈ విధానం ద్వారా సూక్ష్మజీవులు వృద్ధి చెంది, భూములు గుల్లబారి పంటకు కావాల్సిన పోషకాలు విరివిగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణరావు

బొబ్బిలి: మండలంలో జూలై 16వ తేదీ నుంచి చేపట్టనున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో చల్ల లక్ష్మణరావు సూచించారు. స్థానిక పట్టణంలోని ట్రిపుల్ ఎస్ కళాశాలలో ఆ కార్యక్రమానికి సంబంధించి, గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించాలని, బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గొట్టాపు వాసు, తహసీల్దార్ త్రినాథనాయుడు, ఎంపీడీవో పి.రవికుమార్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీడీ జనార్దనరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ జనార్దనరావు గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని, పనిలోకి వచ్చిన వారికే మస్టర్లు వేయాలని సూచించారు. నిర్దేశిత కొలతల ప్రకారం వేతనదారులతో పనులు చేయించి, గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చూడాలని సిబ్బందికి తెలిపారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని తాటిపాడు, లచ్చన్నవలస, వావిలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల దృష్ట్యా రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో మాత్రమే పనులు చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు ఉంచుకోవాలన్నారు. వర్షం పడే సూచన ఉన్నప్పుడే ఇంటికి వెళ్లిపోవాలన్నారు.

రుచికరమైన భోజనం అందివ్వండి

తెర్లాం: పీఎం పోషణ గోరుముద్ద పథకంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులంతా విద్యార్థులకు రుచికరమైన భోజనాలు వండి పెట్టాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని రంగప్పవలస గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మంచి విద్యాబోధనతో పాటు మంచి భోజనం కూడా అందేలా ఉపాధ్యాయులే చూడాలన్నారు.

లెస్సన్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెస్సన్ ప్లాన్ ఆధారంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. గురువారం మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన వివిధ ప్రశ్నల ద్వారా అక్కడి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు బాగుండడంతో ప్రధానోపాధ్యాయుడు మురపాక వెంకటరమణ, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం పలు సూచనలు చేశారు. సమయానికి పాఠశాలకు హాజరుకావాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలో నాడు-నేడు నిధులతో నిర్మించిన తాగునీటి ప్లాంట్‌ను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీ కెంబూరు చంద్రరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అడల్ట్ బీసీజీ టీకాను అందరూ వేసుకోవాలి

రాజాం: టీబీ వ్యాధి నిర్మూలనలో భాగంగా వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ(బీపీ) టీకా కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు కోరారు. గురువారం మండలంలోని దోసరి గ్రామ సచివాలయం వద్ద వైద్య సిబ్బంది నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, టీకాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లలతో పాటు పెద్దలకు కూడా ఈ బీసీజీ టీకా చాలా సురక్షితమన్నారు. అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. గత ఐదేళ్ల ముందు టీబీ వచ్చి తగ్గిన వాళ్లు, 18 ఏళ్ల వయసు నిండిన వాళ్లు, స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటు ఉన్న వాళ్లు, టీబీ పేషెంట్లతో దగ్గర సంబంధాలు ఉన్న వారు అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవచ్చన్నారు. ప్రస్తుతం టీబీ మందులు వాడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ బాధితులు, టీబీ ప్రివెంటివ్ ట్రీట్మెంట్ పొందుతున్న వారు, జ్వరం, దగ్గు, కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నవారు, 18 ఏళ్ల లోపువారు, రక్తదానం చేసి మూడు నెలలు దాటని వారు ఈ టీకాను వేయించుకోవద్దని సూచించారు.